05-12-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - కళ్యాణకారి తండ్రి ఇప్పుడు మీకు ఎటువంటి కళ్యాణాన్ని చేస్తారంటే, ఇక మీరెప్పుడూ ఏడవాల్సిన అవసరం ఉండదు, ఏడవడము అకళ్యాణము మరియు దేహాభిమానానికి గుర్తు"

ప్రశ్న:- ఏ నిశ్చితమైన విధిని తెలుసుకొని మీరు సదా నిశ్చింతగా ఉండాలి?

జవాబు:- ఈ పాత ప్రపంచము యొక్క వినాశనము తప్పకుండా జరగాల్సిందేనని మీకు తెలుసు. శాంతి కొరకు ప్రయత్నిస్తూ ఉంటారు కానీ నరుడు ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచినట్లు అవుతుంది. ఎంత ప్రయత్నించినా సరే ఈ నిశ్చితమైన విధిని తప్పించలేము. ప్రకృతి వైపరీత్యాలు మొదలైనవి కూడా సంభవించనున్నాయి. మేము ఈశ్వరీయ ఒడిని తీసుకున్నాము అని మీకు నషా ఉంది. ఏ సాక్షాత్కారాలైతే చూసారో, అవన్నీ ప్రాక్టికల్ గా జరిగేదే ఉంది. అందుకే మీరు సదా నిశ్చింతగా ఉంటారు.

ఓం శాంతి. విశ్వములో మనుష్యుల బుద్ధిలో భక్తి మార్గానికి సంబంధించిన మహిమయే ఉంది ఎందుకంటే ఇప్పుడు భక్తి మార్గం కొనసాగుతూ ఉంది. కానీ ఇక్కడ భక్తి యొక్క మహిమ లేదు. ఇక్కడ తండ్రి యొక్క మహిమ ఉంటుంది. ఏ తండ్రి నుండైతే ఇంతటి ఉన్నతమైన వారసత్వం లభిస్తుందో, ఆ తండ్రి యొక్క మహిమను చెయ్యాలి. భక్తిలో సుఖము లేదు. భక్తిలో ఉంటూ కూడా స్వర్గాన్నే తలచుకుంటారు కదా. మనుష్యులు మరణించినప్పుడు స్వర్గస్థులయ్యారని అంటారు. మరి అటువంటప్పుడు సంతోషించాలి కదా. స్వర్గములో జన్మ తీసుకున్నారంటే ఇక ఏడ్వాల్సిన అవసరమే లేదు. వాస్తవానికి స్వర్గస్థులయ్యారు అన్నది సత్యము కాదు, అందుకే ఏడుస్తూ ఉంటారు. ఇప్పుడు ఈ ఏడ్చే వారి యొక్క కళ్యాణము ఎలా జరగగలదు? ఏడవడము దుఃఖానికి గుర్తు. మనుష్యులు ఏడుస్తూ ఉంటారు కదా. పిల్లలు కూడా జన్మ తీసుకున్నప్పుడు ఏడుస్తారు ఎందుకంటే దుఃఖము కలుగుతుంది. దుఃఖము లేకపోతే మరి తప్పకుండా హర్షితంగా ఉంటారు. ఎప్పుడైతే ఏదైనా అకళ్యాణము జరుగుతుందో, అప్పుడు ఏడుపు వస్తుంది. సత్యయుగములో ఎప్పుడూ అకళ్యాణము జరగదు, అందుకే అక్కడ ఎప్పుడూ ఏడవరు. అకళ్యాణము యొక్క విషయమే ఉండదు. ఇక్కడ కొన్నిసార్లు సంపాదనలో నష్టం కలిగితే లేక కొన్నిసార్లు ఆహారం లభించకపోతే దుఃఖం కలుగుతుంది. దుఃఖంలో ఏడుస్తారు. మీరు వచ్చి అందరి కళ్యాణము చేయండి అని భగవంతుడిని తలుచుకుంటారు. ఒకవేళ వారు సర్వవ్యాపి అయినట్లయితే కళ్యాణము చేయమని ఎవరిని అడుగుతున్నారు? పరమపిత పరమాత్మను సర్వవ్యాపి అని అనుకోవటము అన్నింటికన్నా పెద్ద పొరపాటు. తండ్రి సర్వుల కళ్యాణకారి, వారొక్కరే కళ్యాణకారి కావున తప్పకుండా సర్వుల కళ్యాణాన్ని చేస్తారు. పరమపిత పరమాత్మ సదా కళ్యాణమే చేస్తారని పిల్లలైన మీకు తెలుసు. ఇప్పుడు విశ్వ కళ్యాణము చేయడానికి ఆ పరమపిత పరమాత్మ ఎప్పుడు వచ్చారు? విశ్వ కళ్యాణము చేసేవారు ఇంకెవ్వరూ లేరు. తండ్రిని సర్వవ్యాపి అని అనేస్తారు. ఇది ఎంత పెద్ద పొరపాటు. ఇప్పుడు తండ్రి తమ పరిచయాన్ని ఇచ్చి మన్మనాభవ అని చెప్తారు, ఇందులోనే కళ్యాణముంది. సత్య-త్రేతా యుగాలలో ఎట్టి పరిస్థితిలోనూ అకళ్యాణము జరగదు. త్రేతాలో కూడా రామరాజ్యం ఉన్నప్పుడు అక్కడ పులి-మేక కలిసి నీరు తాగుతాయి. మనం సీతా-రాముల రాజ్యాన్ని అంతగా మహిమ చేయము ఎందుకంటే రెండు కళలు తగ్గిపోవడంతో సుఖము ఎంతో కొంత తక్కువ లభిస్తుంది. మనము తండ్రి స్థాపించే స్వర్గాన్ని ఇష్టపడతాము. అందులో పూర్తి వారసత్వాన్ని పొందితే చాలా మంచిది. ఉన్నతోన్నతుడైన తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకొని మనం కళ్యాణము చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ శ్రీమతంపై తమ కళ్యాణాన్ని చేసుకోవాలి.

తండ్రి అర్థం చేయించారు - ఒకటేమో అసురీ సాంప్రదాయము, ఇంకొకటి దైవీ సాంప్రదాయము. ఇప్పుడు ఒకవైపు రావణ రాజ్యముంది, ఇంకొకవైపు నేను దైవీ సాంప్రదాయాన్ని స్థాపన చేస్తున్నాను. ప్రస్తుతం దైవీ సాంప్రదాయం ఉందని కాదు. అసురీ సాంప్రదాయాన్ని నేను దైవీ సాంప్రదాయముగా తయారుచేస్తున్నాను. దైవీ సాంప్రదాయమైతే సత్యయుగంలో ఉంటుందని అంటారు. తండ్రి అంటారు - ఈ అసురీ సాంప్రదాయాన్ని దైవీ సాంప్రదాయముగా భవిష్యత్తు కొరకు తయారుచేస్తాను. ఇప్పుడు ఉన్నది బ్రాహ్మణ సాంప్రదాయము, దైవీ సాంప్రదాయము తయారవుతూ ఉంది. మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేయడానికి భగవంతునికి ఎంతో సమయము పట్టదు అని గురునానక్ కూడా అన్నారు. కానీ ఏ మనుష్యులను దేవతలుగా తయారుచేస్తారు? వారికి డ్రామా ఆదిమధ్యాంతాల గురించి తెలియదు. సృష్టి ఆదిలో ఏ లక్ష్మీ-నారాయణులైతే శ్రేష్ఠాచారులుగా ఉండేవారో, వారికి కూడా ఆదిమధ్యాంతాల గురించి తెలియదు. వారు త్రికాలదర్శులు కాదు. అంతకుముందు జన్మలో త్రికాలదర్శులుగా, స్వదర్శన చక్రధారులుగా ఉండేవారు, అప్పుడు ఈ రాజ్యపదవిని పొందారు. వారేమో స్వదర్శన చక్రాన్ని విష్ణువుకు చూపించారు. కావున బ్రాహ్మణులు

స్వదర్శన చక్రధారులు అన్న విషయాన్ని కూడా అర్థం చేయించాలి, అప్పుడు మనుష్యులు ఆశ్చర్యపోతారు. వారైతే శ్రీకృష్ణుడిని మరియు విష్ణువును కూడా స్వదర్శన చక్రధారి అని అనేస్తారు. విష్ణువు యొక్క రెండు రూపాలు ఈ లక్ష్మీ-నారాయణులని వారికి తెలియదు. మనకు కూడా ఇంతకుముందు తెలియదు. మనుష్యులైతే ప్రతి విషయములోనూ విధి అని అంటారు. ఏదైతే జరగనున్నదో దానిని ఎవ్వరూ తప్పించలేరు. ఇది డ్రామా. మరి మొట్టమొదట తండ్రి పరిచయాన్ని ఇవ్వాలా లేక డ్రామా రహస్యాన్ని అర్థం చేయించాలా? అర్థం చేయించేటప్పుడు కూడా బాబా స్మృతి ఉండాలి. మొట్టమొదట తండ్రి పరిచయాన్నే ఇవ్వాలి. అనంతమైన తండ్రి అయిన శివబాబా అయితే ప్రసిద్ధమైనవారు. రుద్ర బాబా అని కూడా అనరు. శివబాబా ప్రసిద్ధమైనవారు. తండ్రి అర్థం చేయించారు - ఎక్కడెక్కడైతే భక్తులు ఉంటారో వారికి వెళ్ళి అర్థం చేయించండి. హిమాలయాల వయస్సు ఇన్ని కోట్ల సంవత్సరాలు అని మనుష్యులు అంటారు, ఈ విషయాన్ని వార్తాపత్రికలో చదివాము. ఇప్పుడు హిమాలయాలకు ఏమైనా వయస్సు ఉంటుందా? ఇవి సదా ఉండనే ఉన్నాయి. హిమాలయాలు ఎప్పుడైనా మాయమవుతాయా? ఈ భారత్ కూడా అనాదియే. ఇది ఎప్పుడు రచించబడింది అంటూ దీని వయస్సును కనుగొనలేరు. అలాగే హిమాలయాల గురించి కూడా అవి ఎప్పటినుండి ఉన్నాయి అన్నది చెప్పలేరు. ఈ హిమాలయ పర్వతాల వయస్సును లెక్కించలేరు. ఆకాశానికి లేక సముద్రానికి ఇంత వయస్సు అని ఏమైనా చెప్పగలరా. హిమాలయాల వయస్సును చెప్పినట్లయితే మరి సముద్రము యొక్క వయస్సును కూడా చెప్పాలి, వారికేమీ తెలియదు. ఇక్కడైతే మీరు తండ్రి నుండి వారసత్వాన్ని పొందాలి. ఇది ఈశ్వరీయ కుటుంబము.

తండ్రికి చెందినవారిగా అవ్వడంతో స్వర్గాధిపతులుగా అవుతారని మీకు తెలుసు. ఇది కేవలం జనక మహారాజు విషయము మాత్రమే కాదు. జీవన్ముక్తిలో అనగా రామరాజ్యములో ఎంతోమంది ఉంటారు కదా. అందరికీ జీవన్ముక్తి లభించి ఉంటుంది. మీరు క్షణములో ముక్తి-జీవన్ముక్తులను పొందే పురుషార్థులు. మీరు పిల్లలుగా అయ్యారు, మమ్మా-బాబా అని అంటారు. జీవన్ముక్తి అయితే లభిస్తుంది కదా. ప్రజలైతే లెక్కలేనంతమంది తయారవుతూ ఉంటారని అర్థం చేసుకోగలరు. రోజురోజుకు ప్రభావమైతే వెలువడేదే ఉంది కదా. ఈ ధర్మాలను స్థాపన చేయడం చాలా కష్టము. వారైతే పై నుండి వచ్చి స్థాపన చేస్తారు, వారి వెనుక వారంతా పై నుండి వస్తూ ఉంటారు. ఇక్కడైతే ఒక్కొక్కరినీ రాజ్య-భాగ్యము పొందేందుకు యోగ్యులుగా చేయవలసి ఉంటుంది. యోగ్యులుగా తయారుచేయడం తండ్రి పని. ఎవరైతే ముక్తి-జీవన్ముక్తులకు యోగ్యులుగా ఉండేవారో, వారందరినీ మాయ అయోగ్యులుగా చేసేసింది. పంచతత్వాలు కూడా అయోగ్యంగా అయిపోయాయి, మళ్ళీ యోగ్యముగా తయారుచేసేది తండ్రియే. ఇప్పుడు క్షణ-క్షణం మీ ఈ పురుషార్థమేదైతే కొనసాగుతుందో, కల్పక్రితము కూడా ఫలానావారు ఈ విధంగానే పురుషార్థం చేసారని భావించడం జరుగుతుంది. కొందరు ఆశ్చర్యము కలిగేలా పారిపోతారు, వదిలి వెళ్ళిపోతారు. ప్రాక్టికల్ గా చూస్తూ ఉంటారు. వినాశనం ఎదురుగా నిలబడి ఉందని కూడా అర్థం చేసుకుంటారు. డ్రామానుసారంగా అందరూ పాత్రలోకి రావాల్సి ఉంటుంది. నరుడు ఒకటి తలిస్తే దైవం మరొకటి తలచినట్లు అవుతుంది. వారు శాంతి ఏర్పడాలని కోరుకుంటారు కానీ విధిలో ఏముంది అనేది పిల్లలైన మీకు తెలుసు. మీరు సాక్షాత్కారాలు చూసారు. వారు వినాశనం జరగకూడదని ఎంతగా తల బాదుకున్నా కానీ ఈ విధిని తప్పించలేరు. భూకంపాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి, వారు ఏమి చేయగలరు. ఇది భగవంతుడి పని అని అంటారు. మీలో కూడా అంతగా నషా ఎక్కి స్మృతిలో ఉండేవారు కొద్దిమందే ఉన్నారు. అందరూ అయితే పరిపూర్ణము అవ్వలేదు. ఈ విధి మారనే మారదు అని మీకు తెలుసు. భోజనము లేదు, మనుష్యులకు ఉండేందుకు స్థానము లేదు, మూడు అడుగుల భూమి కూడా లభించదు.

ఇది మీ ఈశ్వరీయ పరివారము - మాత, పిత మరియు పిల్లలు. తండ్రి అంటారు, నేను పిల్లల ఎదుటే ప్రత్యక్షమవుతాను, పిల్లలకు నేర్పిస్తాను. పిల్లలు కూడా, మేము తండ్రి మతముపై నడుస్తామని అంటారు. తండ్రి కూడా - నేను పిల్లల సమ్ముఖంలోకి వచ్చే మతాన్ని ఇస్తాను అని అంటారు. పిల్లలే అర్థం చేసుకుంటారు. ఎవరైనా అర్థం చేసుకోకపోతే వదిలేయండి, ఇందులో కొట్లాడే విషయమేమీ లేదు. మనం తండ్రి పరిచయాన్ని ఇస్తాము. తండ్రి అంటారు - నన్ను స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి మరియు స్వదర్శన చక్రాన్ని స్మృతి చేసినట్లయితే చక్రవర్తీ రాజులుగా అవుతారు. మన్మనాభవ, మధ్యాజీభవ అర్థం కూడా ఇదే. తండ్రి పరిచయాన్ని ఇవ్వండి, తద్వారా రచయిత మరియు రచనల రహస్యాన్ని అర్థం చేసుకుంటారు. ముఖ్యమైన విషయం ఇదొక్కటే, గీతలో ముఖ్యమైనది ఈ ఒక్క పొరపాటే. తండ్రి అంటారు - కళ్యాణకారినైన నేనే వచ్చి కళ్యాణము చేయాలి. ఇకపోతే శాస్త్రాల ద్వారా కళ్యాణము జరగదు. ముందైతే భగవంతుడు ఒక్కరే అన్నది నిరూపించాలి, మీరు వారిని తలచుకుంటారు కానీ వారి గురించి తెలియదు. తండ్రిని స్మృతి చేయాలంటే పరిచయం కూడా కావాలి కదా. వారు ఎక్కడ ఉంటారు, వస్తారా లేక రారా?

అనేది తెలియాలి. తండ్రి వారసత్వాన్ని తప్పకుండా ఇక్కడి కొరకే ఇస్తారా లేక అక్కడి కొరకు ఇస్తారా? తండ్రి అయితే సమ్ముఖంగా కావాలి. శివరాత్రిని కూడా జరుపుకుంటారు. శివుడు సర్వాత్మలకు ఉన్నతోన్నతమైన తండ్రి. వారు రచయిత, కొత్త జ్ఞానాన్ని ఇస్తారు. సృష్టి చక్రం యొక్క ఆదిమధ్యాంతాల గురించి వారికి తెలుసు. వారు ఉన్నతోన్నతమైన టీచర్, వారు మనుష్యులను దేవతలుగా తయారుచేస్తారు, రాజయోగాన్ని నేర్పిస్తారు. మనుష్యులు ఎప్పుడూ రాజయోగాన్ని నేర్పించలేరు. మనకు కూడా వారే నేర్పించారు కావుననే మనము నేర్పించగలుగుతున్నాము. గీతలో కూడా ప్రారంభములో మరియు అంతిమములో మన్మనాభవ మరియు మధ్యాజీభవ అని అన్నారు. వృక్షము మరియు డ్రామా జ్ఞానము కూడా బుద్ధిలో ఉంటుంది. వివరంగా అర్థం చేయించాల్సి ఉంటుంది. చివరిగా మళ్ళీ ఒకటే విషయము వస్తుంది - తండ్రిని మరియు వారసత్వాన్ని స్మృతి చేయాలి. ఇక్కడైతే ఒకటే విషయముంది, మనం విశ్వాధిపతులుగా అవుతాము. విశ్వకళ్యాణకారియే విశ్వాధిపతులుగా తయారుచేస్తారు, స్వర్గాధిపతులుగా తయారుచేస్తారు, అంతేకానీ నరకాధిపతులుగా ఏమైనా తయారుచేస్తారా. నరకానికి రచయిత రావణుడు, స్వర్గానికి రచయిత తండ్రి అన్నది ప్రపంచానికి తెలియదు. ఇప్పుడు తండ్రి అంటారు - మృత్యువు ఎదురుగా నిలబడి ఉంది, అందరిదీ వానప్రస్థ అవస్థ, నేను తీసుకువెళ్ళడానికి వచ్చాను. నన్ను స్మృతి చేసినట్లయితే వికర్మలు వినాశనమవుతాయి, మురికిగా ఉన్న ఆత్మ శుద్ధముగా అవుతుంది, అప్పుడు మిమ్మల్ని స్వర్గములోకి పంపిస్తాను. ఈ విషయాలను ఇతరులకు నిశ్చయబుద్ధితో అర్థం చేయించాలి, అంతేకానీ చిలుకపలుకుల వలె కాదు. నిశ్చయబుద్ధి కలవారు ఏడ్చే మరియు దేహాభిమానములోకి వచ్చే విషయమే ఉండదు. దేహాభిమానము చాలా అశుద్ధముగా చేస్తుంది. ఇప్పుడు మీరు దేహీ-అభిమానులుగా అవ్వండి. శరీర నిర్వహణార్థం కర్మలు చేయండి. వారైతే కర్మ సన్యాసులుగా అవుతారు. ఇక్కడైతే మీరు గృహస్థ వ్యవహారములో ఉండాలి, పిల్లలను సంభాళించాలి. తండ్రిని మరియు చక్రాన్ని తెలుసుకోవడం చాలా సహజము.

తండ్రికి ఎంతమంది పిల్లలు ఉన్నారు. వారిలో కొందరు సుపుత్రులు, కొందరు కుపుత్రులు ఉన్నారు. పేరును అప్రతిష్ఠపాలు చేస్తారు, నల్ల ముఖము చేసుకుంటారు. తండ్రి అంటారు - నల్ల ముఖము చేసుకోకండి. పిల్లలుగా అయి మళ్ళీ నల్ల ముఖము చేసుకున్నారంటే, కుల కళంకితులుగా అవుతారు. ఈ కామ చితి కారణంగా మీరు నల్లగా అయ్యారు. కామ చితిపై కాలి మరణించకూడదు. కామము యొక్క తేలికపాటి నషా కూడా ఉండకూడదు. సన్యాసులు మొదలైనవారు తమ అనుచరులకు ఈ విధముగా చెప్తారా. వారు వాస్తవికముగా అనుచరులుగా లేరు. తండ్రి అయితే అందరికీ సత్యమైన విషయాలను అర్థం చేయిస్తారు. తండ్రి అంటారు - నన్ను స్మృతి చేయండి. బాబా, మేము మీ మతంపై నడుస్తూ స్వర్గవాసులుగా అవుతాము అని మీరు గ్యారంటీ ఇచ్చారు. తండ్రి అంటారు - పిల్లలూ, మరి మీరు విషయ వికారాలనే మురికిలోకి పడాలనే ఆలోచన ఎందుకు చేస్తున్నారు? కుమార్తెలైన మీరు ఇలాంటి మురళీని వినిపించినప్పుడు, ఇటువంటి జ్ఞానాన్ని మేము ఎప్పుడూ వినలేదని అంటారు. మందిరాలలోని ముఖ్యమైనవారిని పట్టుకోవాలి, చిత్రాలను తీసుకువెళ్ళాలి. ఈ త్రిమూర్తి మరియు వృక్షము యొక్క చిత్రాలు దిల్వాడా చిత్రాలే. పైన దైవీ వృక్షము ఉంది, ఇకపోతే దైవీ వృక్షమేదైతే గతించిపోయిందో దానిని చూపిస్తారు. ఇటువంటి సేవను ఎవరైనా చేసి చూపిస్తే - వీరు అద్భుతం చేసారని బాబా మహిమ చేస్తారు. ఏ విధంగా బాబా రమేష్ ను మహిమ చేస్తారు. ప్రదర్శనీ రూపములో విహంగ మార్గపు సేవ యొక్క మోడల్ ను చక్కగా కనుగొన్నారు. ఇక్కడ కూడా ప్రదర్శనీ చేద్దాము, చిత్రాలైతే చాలా బాగున్నాయి.

ఇప్పుడు చూడండి, ఢిల్లీలో ధార్మిక సమ్మేళనమేదైతే జరుగుతుందో, వారు కూడా ఐక్యత ఉండాలి అని అంటారు. అందులో అర్థమే లేదు. తండ్రి ఒక్కరే, మిగిలినవారంతా సోదరీ-సోదరులు. తండ్రి అన్నవారి నుండి వారసత్వాన్ని తీసుకోవాలి. పరస్పరం కలిసి ఉంటూ పాలు-పంచదారలా ఎలా ఉండాలి అన్న ఈ విషయాలు అర్థం చేసుకోవాల్సినవి. ప్రదర్శనీ యొక్క వృద్ధి కోసము యుక్తులను రచించాలి. ఎవరైతే సేవా ఋజువును చూపించరో, వారికి సిగ్గుగా అనిపించాలి. ఒకవేళ 10 మంది కొత్తవారు వచ్చి, అందులో 8-10 మంది మరణిస్తే ఏమి లాభమున్నట్లు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. శరీర నిర్వహణార్థము కర్మలు చేస్తూ దేహీ-అభిమానులుగా ఉండే అభ్యాసము చేయాలి. ఎట్టి పరిస్థితిలోనూ

ఏడవకూడదు మరియు దేహాభిమానములోకి రాకూడదు.

2. శ్రీమతముపై స్వయం మరియు ఇతరుల యొక్క కళ్యాణము చేయాలి. సుపుత్రులుగా అయి తండ్రి పేరును ప్రఖ్యాతము చేయాలి.

వరదానము:- వ్యర్థ సంకల్పాలను సమర్థములోకి పరివర్తన చేసి సహజయోగిగా అయ్యే సమర్థ ఆత్మ భవ

కొంతమంది పిల్లలు ఇలా ఆలోచిస్తూ ఉంటారు - నా పాత్ర అంతగా కనిపించటం లేదు, యోగము కుదరటమే లేదు, అశరీరిగా అవ్వటమే లేదు అని. ఇవి వ్యర్థ సంకల్పాలు. ఈ సంకల్పాలను పరివర్తన చేసి సమర్థ సంకల్పాలను చెయ్యండి - స్మృతి అనేది నా స్వధర్మము, నేనే కల్పకల్పపు సహజయోగిని, నేను యోగిగా అవ్వకపోతే ఇంకెవరు అవుతారు. ఏం చేయను, నా శరీరమైతే నడవలేకపోతోంది, ఈ పాత శరీరము పనికిరానిది... అని ఎప్పుడూ భావించకండి. వాహ్-వాహ్ అనే సంకల్పాలను చెయ్యండి, ఈ అంతిమ శరీరము యొక్క అద్భుతాన్ని గానం చెయ్యండి, అప్పుడు సమర్థత వచ్చేస్తుంది.

స్లోగన్:- శుభ భావనల శక్తి అనేది ఇతరుల వ్యర్థ భావనలను కూడా పరివర్తన చెయ్యగలదు.